సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్‌ నంబర్‌కు వాట్సాప్‌ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

ఇరుకు దారులు.. ట్రాఫిక్‌ కష్టాలు



అసలే ఇరుకు రోడ్లు, అడుగుకో గుంత..పెరిగిపోతున్న ట్రాఫిక్‌తో రైల్వే న్యూకాలనీ శివాలయం ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైల్వేన్యూకాలనీ ఆర్చి నుంచి 80 ఫీట్‌ రోడ్‌ వరకు రహదారులు కుదించుకుపోతున్నాయి. రైల్వేన్యూకాలనీలోని ప్రధాన రహదారి వెంబడి పలు వ్యాపార సముదాయాలు, రోడ్లపైనే చిరు వ్యాపారులు, తోపుడుబళ్లు, వీటికి అదనంగా కొన్ని చోట్ల మరమ్మతులు కోసం తవ్వేసిన రోడ్లతో ట్రాఫిక్‌ కష్టాలు పెరిగిపోయాయి. ఈ ప్రాంతంలో పలు ప్రైవేట్‌ స్కూల్స్‌, జీవీఎంసీ ప్రాథమిక స్కూల్‌ కూడా ఉన్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాలలకు వెళ్లి వచ్చే విద్యార్థుల తో విపరీతమైన రద్దీ ఏర్పడుతోంది. విద్యార్థులను రోడ్డు దాటించాలంటే తల్లిదండ్రులు భయపడే పరిస్థితి ఉంది. ఈ పరిస్థితులకు తోడు కొందరు యువకుల ర్యాష్‌ డ్రైవింగ్‌తో ఈ ప్రాంతవాసులు బెంబేలెత్తిపోతున్నారు. రైల్వేన్యూకాలనీ శివాలయం మెయిన్‌రోడ్డులో చాలా చోట్ల రోడ్లపైనే వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో కూడా ట్రాఫిక్‌ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. -తాటిచెట్లపాలెం



నిత్యం రద్దీగా ఉండే రైల్వే న్యూకాలనీ ఆర్చ్‌, శివాలయం రోడ్డు



రైల్వేన్యూకాలనీ మార్కెట్‌ వద్ద రోడ్డుపైనే వ్యాపారాలు



హరగోపాల్‌ స్కూల్‌ వద్ద రహదారి పరిస్థితి



రద్దీగా విశ్వతేజ స్కూల్‌ రోడ్డు

క్లుప్తంగా

హుండీ ఆదాయం లెక్కింపు



దేవస్థానం హుండీ ఆదాయం లెక్కింపును పరిశీలిస్తున్న ఈవో

సీతమ్మధార: జీవీఎంసీ పరిధి 24వ వార్డు నక్కవానిపాలెంలోని శ్రీ ఉమానీలకంఠేశ్వర స్వామి దేవస్థానం హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో దేవదాయశాఖ తనిఖీదారుడు కె. శ్రీనివాస్‌రావు పర్యవేక్షణలో దేవస్థానం ఆవరణలో హుండీ ఆదాయాన్ని లెక్కించినట్టు తెలిపారు. ఈవో మాట్లాడుతూ మొత్తం 98 రోజులకు రూ.2.59 లక్షలు ఆదాయం వచ్చిందన్నారు. శ్రీహరి సేవా సంఘం సభ్యులు, హుండీ ఆదాయాన్ని లెక్కించారు. కార్యక్రమంలో అర్చకుడు ఉమామహేష్‌, దేవస్థానం సిబ్బంది చంద్రశేఖర్‌ పాల్గొన్నారు.

నేడు వైభవునికి పంచామృతాభిషేకం



వైభవ వేంకటేశ్వరుడు

మురళీనగర్‌: కప్పరాడ ఎన్‌జీజీవోస్‌ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పాల్గుణ పూర్ణిమ సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి బి.ప్రసాద్‌ తెలిపారు. ఉదయం 6.30 గంటలకు ఆర్జిత సేవ, మంగళ ధ్వని, మేళతాళాల మధ్య ఆలయ ప్రదక్షణ నిర్వహిస్తారు. అనంతరం సుగంధ ద్రవ్యాలతో స్వామికి పంచామృతాభిషేకం నిర్వహిస్తారు.

నిద్రలేమితో అనారోగ్య సమస్యలు

సీతంపేట: ప్రతీ జీవికి నిద్ర అత్యవసరమని, నిద్ర లేకుండా మనుగడ సాగదని ప్రముఖ మానసిక వైద్యుడు, ప్రభుత్వ మానసిక వైద్యశాల విశ్రాంత సూపరింటెండెంట్‌ ఎన్‌.ఎ న్‌.రాజు అన్నారు. ప్రపంచ నిద్ర దినోత్సవం సందర్భంగా ద్వారకానగర్‌ పౌరగ్రంథాలయంలో గురువారం కౌసల్య కౌన్సెలింగ్‌ సెంటర్‌ నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. నిద్రలేమి వల్ల అనేక శారీరక, మానసిక రుగ్మతలు తలెత్తుతాయని, ఫలితంగా దీర్ఘకాలిక వ్యాధుల బారినపడే ఆవకాశం ఉందన్నారు. యోగా,ధ్యానం వంటి చర్యలతో చక్కని నిద్రను పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌ ఎన్‌.జి.నిహాల్‌, పి.ఎస్‌.కుమార్‌ పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులు పొమ్మంటే.. ‘టీఎస్‌ఆర్‌’ ఆశ్రయమిచ్చింది



టీఎస్‌ఆర్‌ షెల్టర్‌లో నారాయణరావు

సీతమ్మధార: బ్యాగుతో ఉన్న వ్యక్తి పేరు వడ్డి నారాయణరావు (61). అక్కయ్యపాలెం. భార్యాఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆస్తి మొత్తం తీసుకుని ఇంటి నుంచి వెళ్లగొట్టారు. అనారోగ్యం కారణంగా ఆర్టీసీ కాంప్లెక్స్‌ వద్ద దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. ఇది గమనించిన జీవీఎంసీ ఏయూటీడీ సిబ్బంది టీఎస్‌ఆర్‌ షెల్టర్‌కు తరలించి ఆశ్రయం కల్పించినట్టు సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన

మద్దిలపాలెం: చట్టాల గురించి విద్యార్థులు క్షుణ్ణంగా తెలుసుకోవాలని సీనియర్‌ సివిల్‌ జడ్జి ఎం.వెంకట శేషమ్మ అన్నారు. డాక్టర్‌ వి.ఎ స్‌.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం విద్యార్థులకు చట్టాలపై ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలను లైగింక దాడులు, వేధింపుల నుంచి పోక్సో చట్టం-2012 రక్షిస్తుందన్నారు. పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడే నిందితులకు మూడేళ్ల నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా విధిస్తారన్నారు. నేరాల విచారణకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయడానికి, వేగవంతమైన, సమర్థవంతమైన న్యాయాన్ని అందించడానికి ఈ చట్టం వీలు కల్పిస్తుందని వెంకట శేషమ్మ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఐ.విజయబాబు, ఐసీడీఎస్‌ ప్రాజెక్ట్‌ డైరెక్టర్‌ జి.జయదేవి, వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ పి.జయ, ఎన్‌ఎస్‌ఎస్‌ జోనల్‌ ప్రోగ్రాం ఆఫీసర్‌ డాక్టర్‌ పి.ఉమామహేశ్వరరావు, డాక్టర్‌ బి.లక్ష్మి, డాక్టర్‌ బి.నాగేశ్వరరావు, డాక్టర్‌ జి.వి.ప్రతాప్‌, డాక్టర్‌ ప్రసన్న, డాక్టర్‌ జి.లక్ష్మణరావు, డాక్టర్‌ సిహెచ్‌.అనురాధ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

- ఏసీలో షార్ట్‌సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు
- రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం అంచనా
- మాధవధార వుడా కాలనీలో ఘటన



అపార్ట్‌మెంట్‌ ఫ్లాట్‌లో పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ రెయ్యి వెంకటరమణ



వుడా కాలనీ అపార్ట్‌మెంట్‌లో మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మాధవధార వుడా కాలనీ ఎంఐజీ 146 వద్ద ఓ అపార్ట్‌మెంట్‌లో గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. శబ్దాలతో కూడిన మంటలు చెలరేగడంతో ఒక్కసారిగా నివాసులు భయాందోళనలతో బయటకు పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని మంటలు అదుపుచేశారు. స్థానికులు తెలిపిన వివరాలిలా.. మాధవధార వుడా కాలనీలోని మినిష్‌ అపార్ట్‌మెంట్‌లో పోర్టు విశ్రాంత ఉద్యోగి వెంకటరావు తన భార్యతో కలిసి నివసిస్తున్నారు. గురువారం మధ్యాహ్న భోజనం తర్వాత కాసేపు విశ్రాంతి తీసుకునేందుకు నిద్రకు ఉపక్రమించారు. కొంతసేటి తర్వాత ఏసీ నుంచి పెద్ద శబ్దం వచ్చి మంటలు చెలరేగడాన్ని గమనించి బయటకు పరుగులు తీశారు. చుట్టుపక్కల వారంతా హుటాహుటిన అక్కడికి చేరుకుని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. మర్రిపాలెం అగ్నిమాపక సిబ్బంది, అసిస్టెంట్‌ డిస్ట్రిక్ట్‌ ఫైర్‌ ఆఫీసర్‌ ప్రసాద్‌,ఫైర్‌మెన్‌ అర్జున సిబ్బందితో కలిసి మంటలను అదుపు చేశారు. ప్రమాద సమయంలో ఇంట్లో ఉన్న ఫర్నిచర్‌, ఇతర గృహోపకరణాలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగి ఉండవచ్చని ఫైర్‌ సిబ్బంది అంచనా వేస్తున్నారు. కొంత బంగారం కాలిపోతుండటంతో దానిని తీసి యజమానికి అప్పజెప్పామని, రూ.15 వేలు నగదు కాలి బూడిదయ్యిందని తెలిపారు. బీరువాలో రూ.20 వేలు నగదు సురక్షితంగా ఉందన్నారు. ఏసీ వద్ద షార్ట్‌సర్క్యూట్‌ జరగడం వల్లే అగ్నిప్రమాదం సంభవించిందని స్థానికులు, ఫైర్‌ సిబ్బంది తెలిపారు. నిత్యం ట్రాన్స్‌ఫార్మర్‌ సమస్యతో చుట్టుపక్కల ఇలాంటి అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయని నివాసులు చెబుతున్నారు. విద్యుత్‌ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- అపార్ట్‌మెంట్‌ వద్దకు గురువారం సాయంత్రం వార్డు కార్పొరేటర్‌ రెయ్యి వెంకటరమణ వెళ్లి అగ్నిప్రమాద స్థాయిని పరిశీలించారు. అనంతరం బాధితులతో మాట్లాడారు.

రైల్వేస్టేషన్‌లో 11 కిలోల గంజాయి స్వాధీనం



జీఆర్పీ, ఆర్పీఎఫ్‌ సిబ్బంది అదుపులో గంజాయితో నిందితుడు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌ మీదుగా గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న నిందితుడిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని, 11 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్‌ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా... విశాఖ జీఆర్పీ ఇన్‌స్పెక్టర్‌ సిహెచ్‌.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్‌పీ ఎస్‌ఐ కె.టి.ఆర్‌.లక్ష్మి, ఆర్పీఎఫ్‌ ఇన్‌స్పెక్టర్‌ కె.రామకృష్ణ సిబ్బందితో కలిసి గురువారం విశాఖ రైల్వేస్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫారాల్లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లాకు చెందిన చిరుమామిళ్ల గోపి విశాఖ రైల్వే స్టేషన్‌ మీదుగా అక్రమంగా గంజాయిని రవాణా చేయడాన్ని ఆర్పీఎఫ్‌ సిబ్బంది గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని జీఆర్పీ సిబ్బందికి అప్పగించగా.. అతడి వద్ద నుంచి రూ.55 వేల విలువైన 11 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణాదారుడిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

ఆహార నియమాలు పాటిస్తే వ్యాధులు దూరం



పరీక్షలు చేస్తున్న వైద్య బృందం

మురళీనగర్‌: మంచి ఆహార నియమాలు పాటిస్తే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని నెఫ్రాలజిస్టు డాక్టర్‌ వేణుగోపాల్‌ అన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా మహిళా వాకర్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో అధ్యక్షురాలు కె.మాధవి అధ్యక్షతన కేర్‌ ఆస్పత్రి సహకారంతో ఈస్ట్‌ పార్క్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిడ్నీకి సంబంధించిన వ్యాధులు వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండాలన్నారు. ప్రతి రోజూ కనీస వ్యాయామం చేయాలని సూచించారు. ఈ సంర్భంగా 98 మందికి బీపీ, షుగర్‌, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్‌ అధ్యక్ష, కార్యదర్శులు కె.మాధవి, పి.కమల, వాకర్స్‌ డిస్ట్రిక్ట్‌-101 గవర్నర్‌ కె.ద్వారకానాథ్‌, ఈస్ట్‌ పార్కు అధ్యక్షుడు బి.మురళీకృష్ణ, కార్యదర్శి ప్రసాద్‌, వుడా కాలనీ నివాసితులు సంఘం కార్యదర్శి సూర్యనారాయణ, కేర్‌ మార్కెటింగ్‌ మేనేజర్‌ సురేష్‌ కుమార్‌ తదితరులు పాల్గొని శిబిరం నిర్వహణకు సహకరించారు.

విద్య నేర్పిన గురువులను మరవద్దు



విద్యార్థులకు పెన్నులు,పెన్సిళ్లు అందజేస్తున్న వంకాయల సన్యాసిరాజు

సీతంపేట: ఆందోళన వీడితే పరీక్షలు బాగా రాయగలరని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ మాజీ చైర్మన్‌ వంకాయల సన్యాసిరాజు అన్నారు. అక్కయ్యపాలెం వాగ్దేవి స్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభలో ఆయన మాట్లాడారు. విద్య నేర్పిన గురువులను, పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను ఎన్నటికీ మర్చిపోకూడదని హితవు పలికారు. ప్రతి విద్యార్థి శ్రద్ధగా చదివి పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సాధించాలన్నారు. ఈ సందర్భంగా పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో రమేష్‌ చంద్‌జైన్‌, ఎం.వి.రాజశేఖర్‌, సీహెచ్‌.వి.సత్యనారాయణ, స్కూల్‌ ప్రిన్సిపాల్‌ ఎం.వి.వి.సత్యనారాయణ, వైస్‌ ప్రిన్సిపాల్‌ ఎం.ఎస్‌.ఎల్‌.శైలజ, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వసంత నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మురళీనగర్‌: మురళీనగర్‌ రామాలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేసినట్లు ఆల నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టి.నారాయణ రెడ్డి, సనపల వరప్రసాద్‌ తెలిపారు. ఈ నెల 30 నుంచి ఏప్రిల్‌ 6 వరకు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా గురువారం శ్రీరామనవమి ఉత్సవాల కరప త్రాలు ఆవిష్కరించారు. ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై 28న చలో పార్లమెంట్‌



కార్మిక శాఖ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న పడాల రమణ, సుబ్బయ్య

సీతంపేట: ఆంధ్రప్రదేశ్‌ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును తక్షణమే పునరుద్ధించి న్యాయం చేయాలని లేదంటే ఆందోళన తప్పదని భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ రాష్ట్ర సచివాలయంలో కార్మిక శాఖా మంత్రి పేషీలో ప్రత్యేక కార్యదర్శి సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ అధికారంలోకి రాగానే భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పునరుద్ధరించి న్యాయం చేస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్‌, లోకేష్‌ హామీ ఇచ్చారని, హామీని అమలు చెయ్యమని ఎన్నిసార్లు కార్మిక శాఖా మంత్రిని, అధికారులను కలిసినా ఫలితం కనిపించలేదన్నారు. ప్రభుత్వం అధికారం చేపట్టి 9 నెలలు గడిచినా తమ సమస్యలు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. సంక్షేమ బోర్డును పునరుద్ధించి, పెండింగ్‌లో ఉన్న 44వేల క్లెయిమ్స్‌ పరిష్కరించాలని కోరారు. సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులందరికీ హెల్త్‌ చెకప్స్‌ చెయ్యాలని డిమాండ్‌ చేశారు. రాష్ట్రంలో అనేక రంగాలలో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సెస్సు వసూలు చెయ్యడం లేదని, ప్రభుత్వ కట్టడాలు, రోడ్లు భవనాలు, మున్సిపాలిటీలు, ఇరిగేషన్‌, పంచాయతీరాజ్‌ శాఖల్లో జరిగే నిర్మాణాల నుంచి ఒక్క శాతం సెస్సు వసూలు చేసి కార్మికులకు మేలు చేయాలని కోరారు. ఈనెల 28న భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై చలో పార్లమెంట్‌ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్‌ గౌరవాధ్యక్షుడు ఎస్‌.వెంకటసుబ్బయ్య, రాష్ట్ర అధ్యక్షుడు పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు రాంజీ ఎస్టేట్‌ ప్రాథమిక పాఠశాలలో గురువారం హెచ్‌ఎం ఎస్‌.దొరబాబు సమక్షంలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. టీబీ లక్షణాలు కనిపిస్తే పబ్లిక్‌ హెల్త్‌ సెంటర్లో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రెండు వారాలు మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, ఛాతీలో నొప్పి వంటి లక్షణాలను టీబీగా నిర్ధారణ చేసుకోవచ్చని టీబీహెచ్‌ఎస్‌ సూర్యనారాయణ, హెచ్‌వీ నూనుల పైడిరాజు తెలిపారు. ఆశావర్కర్లు, ఎఎన్‌ఎంలు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రూ.10.77 లక్షలతో పార్కు అభివృద్ధి పనులు



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్‌ సాడి పద్మారెడ్డి, శ్యామలాదీపిక

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు టీపీటీ కాలనీలోని బృందావన్‌ పార్కులో అభివృద్ధి పనులకు గురువారం కార్పొరేటర్‌ సాడి పద్మారెడ్డి, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కుమార్తె, బీజేపీ నేత శ్యామలాదీపిక శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పద్మారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో జీవీఎంసీ నిధులు రూ.10.77 లక్షలు విడుదల చేయడంతో పార్కు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. శ్యామలాదీపిక మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని పార్కులకు పూర్వవైభవం తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో జోన్‌-3 కమిషనర్‌ శివప్రసాద్‌, ఏఈ శ్రీనివాసరావు, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ రవి, సీతమ్మధార మండల ప్రెసిడెంట్‌ రామరాజు, గిరీష్‌, సంజీవరావు, నారా కిశోర్‌, లక్ష్మీనారాయణ, పార్కు ప్రెసిడెంట్‌ ప్రసన్న, టీడీపీ నాయకుడు బర్ల బాలకృష్ణ, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులతో జాగ్రత్త



అవగాహన కల్పిస్తున్న సీఐ రవికుమార్‌

మర్రిపాలెం: అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉంటూ పోలీసులకు సమాచారం అందించాలని కంచరపాలెం ఐదో పట్టణ సీఐ రవికుమార్‌ అన్నారు. నేరాల నియంత్రంపై గాంధీనగర్‌లో తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిస కాకూడదని, భవిష్యత్తును అందంగా మలుచుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్టు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. తల్లిదండ్రులు వారి పిల్లల భవిష్యత్తు, ఎదుగుదల దృష్టిలో పెట్టుకుని వారిని గమనిస్తూ ఉండాలని అన్నారు. వారితో స్నేహపూర్వకంగా మెలుగుతూ వారితో నిత్యం మాట్లాడుతూ ఉండాలన్నారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

దాబాగార్డెన్స్‌: ఏపీ స్టేట్‌ స్కిల్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ (ఏపీఎస్‌ఎస్‌డీసీ), స్కిల్‌ హబ్‌ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మహిళలకు మూడు నెలల టైలరింగ్‌ కోర్సులో ఉచిత శిక్షణ అందివ్వనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఆర్‌ మంజుల ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌ విద్యార్హత కలిగి ఉండాలని, దరఖాస్తులు ఈ నెల 19లోగా అందజేయాలని, వివరాలకు 91216 76360 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రాంగ్‌ పార్కింగ్‌కు చెక్‌

సాక్షి ఎఫెక్ట్‌..



బాలయ్యశాస్త్రి లేఅవుట్‌ రోడ్డులో వాహనాలను క్లియర్‌ చేసిన ట్రాఫిక్‌ ఎస్‌ఐ, సిబ్బంది

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌ కాలనీలో ట్రాఫిక్‌ సమస్యలు లేకుండా ద్వారకా ట్రాఫిక్‌ పోలీసులు చర్యలు చేపట్టారు. ఇక్కడి రహదారుల్లో ఇష్టానుసారంగా వాహనాలు నిలపడంపై ‘పార్కింగ్‌ ఇలా.. రాకపోకలెలా..?’ అనే శీర్షికన గురువారం ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి ద్వారకా ట్రాఫిక్‌ సీఐ కె.ఎస్‌.ఎన్‌.వి.ప్రసాద్‌ తక్షణం స్పందించారు. ఆయన ఆదేశాలతో ఎస్‌ఐ ప్రతాప్‌ తన సిబ్బందితో కలిసి అభయాంజనేయ స్వామి గుడి జంక్షన్‌ దరి షాపింగ్‌ కాంప్లెక్స్‌ ఎదుట రాంగ్‌ పార్కింగ్‌ చేసిన వాహనాలకు చలానాలు విధించారు. ట్రాఫిక్‌ను క్లియర్‌ చేసి వాహనదారులకు అవగాహన కల్పించారు. సమస్య పరిష్కారమవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సహస్ర దీపాలంకరణ సేవ



లలితా పీఠంలో సహస్ర దీపాలంకరణ సేవ

సీతంపేట: పౌర్ణమి సందర్భంగా అక్కయ్యపాలెం లలితాపీఠంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పీఠం దర్బారు హాల్లో లలితా కామేశ్వరులకు సామూహిక సహస్రనామ కుంకుమార్చన చేశారు. అనంతరం సహస్ర దీపాలంకరణ సేవ గావించారు. పలువురు భక్తులు కుంకుమార్చనలో పాల్గొని దీపాలు వెలగించి లలితా కామేశ్వరులకు పూజలు చేశారు. పీఠం మేనేజర్‌ మన్నవ కృష్ణసేన్‌ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గెడ్డల శుభ్రత పట్టదా..?

- విపరీతంగా పేరుకుపోయిన వ్యర్థాలు
- కానరాని పారిశుధ్య సిబ్బంది



పెట్రోల్‌ బంక్‌ పక్కనున్న గెడ్డలో వ్యర్థాలు



రేసపువానిపాలెం గెడ్డలో పేరుకుపోయిన చెత్త, ముురుగు

సీతమ్మధార: జీవీఎంసీ 14, 24 వార్డుల్లోని గెడ్డలు పూడికలతో నిండి ఘోరంగా దర్శనమిస్తున్నాయి. గెడ్డలను శుభ్రం చేయాల్సిన పారిశుధ్య సిబ్బంది జాడ కానరావడం లేదు. జోన్‌-3 అధికారులు పట్టించుకోకపోవడంతో ఏ వార్డులోనూ పారిశుధ్యం మెరుగుపడటం లేదు. డంపర్‌ బిన్లు వ్యర్థాలతో నిండిపోయినా తరలించే నాథుడే కరువవ్వడంతో చెత్తంతా గెడ్డల్లోనే కలిసిపోతోంది. దీంతో దోమలు, ఈగలు విజృంభించి స్థానిక ప్రజలను జ్వరాల బారిన పడేస్తున్నాయి.

24వ వార్డు నక్కవానిపాలెం, రేసపువానిపాలెం, సత్యం జంక్షన్‌, గాంధీనగర్‌, టీపీటీ కాలనీ, పీ అండ్‌ టీ కాలనీ, 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌, గురుద్వారా ప్రాంతాల్లో గెడ్డలు కంపుకొడుతున్నా.. అధికారులకు మాత్రం చీమకుట్టినట్టయినా లేకపోవడం గమనార్హం. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో పెట్రోల్‌ బంక్‌ను ఆనుకుని ఉన్న గెడ్డలో చెత్తాచెదారం, మురుగు పేరుకుపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు, కాలువలు, గెడ్డలు చెత్తాచెదారానికి నిలయంగా మారాయి. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు, సచివాలయం శానిటరీ సెక్రటరీలు ఏం చేస్తున్నారో గాని గెడ్డల శుభ్రత మాత్రం కానరావడం లేదని ప్రజలు నిట్టూరుస్తున్నారు. గెడ్డల్లో ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. ఫలితంగా వీటిని ఆనుకుని ఉన్న రోడ్ల మీద పాదచారులు, వాహన చోదకులు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా.. జీవీఎంసీ జోన్‌-3 ప్రజారోగ్య శాఖ విభాగం అధికారులకు మాత్రం చెవికెక్కడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. గెడ్డల్లో పూడిక పేరుకుపోవడంతో పందులు, కుక్కలు చేరి చెల్లాచెదురు చేస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్య సిబ్బంది ద్వారా గెడ్డల్లో పేరుకుపోయిన చెత్తను తరలించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్‌ నార్త్‌
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com